# ధర్మసాధని

[బ్రాహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాం మధు.

సంపుటము ౮.
సంచిక ౪౨.

22 1921

కాకినాడ:—శనివారము, అక్టోబరు, ౨౨, ౧౯౨౧.

చందా సం॥ రు ౩.
విడిసంచిక అ ౧.

## ఓమ్.

పరాత్పరా! నీ వెక్కడ, నే నెక్కడ? నిన్ను పొందవలెనని నా అపేక్ష. నీవు మహో మహోన్నత పర్వత శిఖరాగ్రమున నున్నాడవు. నేనో తత్పర్వతము యొక్క అట్టడుగు భాగమున ఎక్కుచు జారుచు తొక్కిసలాడు చున్నాను. అవరోహింప వలసిన దూరము ఎంతయో గలదు. నా శక్తి చూడ అత్యల్పము. బుద్ధిబల లేదు. ధైర్యసాహసములు లేవు. నీ అనుగ్రహాతిశయమున గాక కేవలము నాబలము చేతనే యీ దుష్కర కార్యమును సాధింప గల్గుదునా? కరుణా నిధీ! అతి ప్రయాసకరమైన ఈ యాత్రయందు నీవు నాకు సహాయుడవు గమ్ము. ఆశీర్వదింపుము. పా. స.

---

## ప్రేమ శోధనము.

—:o:—

నాకు ప్రాణము నిచ్చి నన్ను నవనవరీతుల
నానందమున ముంచి నన్ను సుఖపరచుటకు
నెన్నియో విధములగు నవభావముల జేరి
యొకవేళ లాలించి యొకవేళ కోపంబు
నటియించి నేర్పుతో నే నొచ్చుకొను చుండ
తా సంతసించుచు దగ్గిరించిన నేను
తా దూరమగుచును తప్పించుకొనుచును
దీనభావంబుతో దయజూప ప్రార్థింప
మఱికొంత మౌనముతో మురిపెంబులను సల్పి
ముద్దాడబోవగా ముఖమును ద్రిప్పుకొని
కౌగిట జేర్పగా కాఠిన్యమును జూప
నే నెటుల ఖిన్నుడై నిలబడుదు దూరముగ
నిశ్శబ్దముగ నుండ నెక్కొన నను గూడి
నెయ్యమును సల్పుచు నా చెంత జేరునో
నటువలె నీవును నా ప్రేమ శోధింప
నన్ను విడనాడుచు నా భక్తి గానకయు
నా మాట వినకయు నాదు సంకీర్తనల్
పెడచెవిని బెట్టుచును పెదవులను విరుచుచును
ప్రేమ విహీనుడై పలుమారు నను వీడ
పాపములనే జిక్కి పలుబాములను బడుచు
పాతకంబుల జేసి పరపీడనంబున
సంతృప్తి నడయుచు సర్వవిధముల నేను
సత్యంబు విడనాడి శాశ్వత నరకంబు
చనుచుండ నను జూచి చప్పున స్పర్శించి
సంతోష వదనమును శాంతి స్వరూపము
సొబగు మీరగజూపి సొరుతో నను జేరి
సొంపైన మాటలతో చింతలను నెడబాపి
ధైర్యంబు పురికొల్పి దీనత్వమును మాన్పి
దీనకార్యంబులన్ దయా ధర్మంబులన్
దేశసేవారతిన్ దాస్య భావంబునన్
నే జేయ బూనగా నన్నుత్సహించుచు
నా భుజములను దట్టి నన్ను హెచ్చరికతో
నడిపించు నట్టి యో నీతి నైపుణ్యుడా!
నీ సేవలో మునిగి నీ సన్నిధిని నుండి
నిరతంబు నీవాణి నెప్పుడును వినుచుండి
నిత్య జీవనము నే నెప్పుడును వాంఛింతు.

ఇ. సు. కృ.

---

# అభయము.

—:o:—

శ్లో॥ భోగే రోగ భయం కులే చ్యుతి భయం
విత్తే నృపాలా ద్భయం।
మానే దైన్యభయం బలే రిపు భయం
రూపే జరాయాభయం।
శాస్త్రే వాద భయం తపేందిృయ భయం
కాయే కృతాం దాద్భయం।
సర్వం వస్తు భయాన్వితం భువిన్వణాం
జ్ఞానీ సదా నిర్భయః॥

ప్రపంచము భయాకీర్ణము. ఏవైపున జూచినను భయానకమె. ఎవ్వడు పట్టినను భయగ్రస్తుడే. భోగపరాయణుడు ఏ రోగము వచ్చి తన్ను భోగదూరుని చేయునో యని భయపడుచున్నాడు. కులీనుడు తన గౌరవమున కెక్కడ భంగము కలుగునో యని భయము చెందుచున్నాడు. ధనవంతులు ప్రభువులు తమ ధనమును బలాత్కరించి అపహరించెదరని భయపడుచున్నారు. మానవంతుడు తన కెప్పుడు దైన్యము సంభవించునో యని భయము చెందుచున్నాడు. బలవంతులు తమ్ము ఏ శత్రువులు ఓడింతురో యని భయపడుచున్నారు. రూపవంతులు ముదిమివలన తమ సౌందర్యమునకు హాని కలుగునేమో యని భయపడుచున్నారు. విద్యావంతులు తమ్ము మించిన పండితులు తమకు పరాభవము కలిగింతురేమో యని భయపడుచున్నారు. తపశ్శాలి తన్ను ఇంద్రియము లెప్పుడు లోబఱచుకొనునో యని భయకంపితుడగుచున్నాడు. శరీరమే సర్వమని తలపోయువాడు మృత్యువు, తన్నెన్నడు మ్రింగునో యని భయగ్రస్తుడగుచున్నాడు. ఇట్లు ఎవ్వరు చూచినను భయాక్రాంతులై బాధ పడుచునే యున్నారు.

ఈ నానావిధ భయములనుండి తప్పించుకొను ఉపాయ మెద్ది? మనుష్యుడు జ్ఞాని గావలెను. యథార్థ జ్ఞానమును సంపాదింపవలయును. జ్ఞానమన గానేమి? జ్ఞాన మన ఉదరపోషణార్థమై అభ్యసింపబడు విద్య గాదు. జ్ఞాన మన ఐహిక సుఖాభివృద్ధిని గూర్చు పదార్థ శాస్త్రము గాదు. జ్ఞాన మన మానవ వంచనమున కుపయోగపడు తంత్రగొట్టు చదువు గాదు. జ్ఞాన మన మనుష్య సంహారమునకై తోడ్పడు మారణ మంత్రము గాదు. ఈవిద్య లెన్నడును మనుష్యుని భయరహితుని చేయజాలవు.

"యదా హ్యేవైష ఏతస్మిన్న దృశ్యే నాత్మ్యే నిరుక్తే నిలయనే భయం। ప్రతిష్ఠాం విన్దతే అథసో భయం గతో భవతి."

నిరాధారుడను, రూపరహితుడును, వర్ణనాతీతుడును అగు ఆ పరమాత్మను ఎవ్వరు తెలిసికొనుచున్నారో వారే భయదూరులగుచున్నారు. అభయమును పొందవలయునన్న ఆ బ్రహ్మ జ్ఞానమును పడయవలెను. జ్ఞాని యన కేవలము మాట మాత్రముగా దేవుని తెలిసికొన్నవాడే గాడు. జ్ఞాని ఈశ్వరుని పొందిన సిద్ధుడు. అట్టి సిద్ధుని భయము లెట్లు లోబఱచుకొనగలవు.

అతడు పరమ జనకుడగు ఈశ్వరుని శరణ్యమును పొందినాడు. అతడు జగన్మాత యొక్క క్రొడిలో నిశ్చింతుడై ఆనందము ననుభవించుచున్నాడు. మనము భయ సంకల్పితమయిన యీలోకమునందు అభయస్థితిని బడయువలెనన్న ఆ పరమేశ్వరుని ప్రాపును పొందవలయును. సమస్త భారమును ఆతని హస్తములయం దుంచవలయును. పాల ముంచినను నీట ముంచినను నీవే అనవలయును. అపుడు శరీర వ్యాధులు మనకు భయమును కలిగింపజాలవు. పేదరికము మనల భయపెట్టజాలదు. కామక్రోధాది శత్రువులు మనల జడిపింపజాలవు. గౌరవహాని యను తలంపే మన మనస్సులో ప్రవేశింపజాలదు. మృత్యువు మనకు వెఱపును గొల్పనేరదు. ఈశ్వరుడే మన ఆరోగ్యము. ఈశ్వరుడే మన ధనము. యీశ్వరుడే మన గౌరవము. యీశ్వరుడే మన అమృతధామము. యీశ్వరుడే మన సర్వస్వము. ఇక అభయము గాక భయమునకు స్థల మెక్కడ?

పా. న.

# రామతీర్థుని యుపదేశము.

—:o:o:o:—

మానవుల జూచినాడ. మానవలోకము నాకు పరిచయస్థలము. మానవుల యొక్క విశాలహృదయములం దొలుకుచుండునది తీయని మకరందము. వివిధ దీపములచే నది పరిమళము గలదియయ్యెను. దానిని త్రాగి మత్తెక్కి పడియుండెదను.

బిత్తల దిరుగువారికి దుస్తు లొసగుదువు. శ్రమపడు వారిని గాంచి కనికరింతువు. ఇంతమాత్రమే నీవు చేయదగినది కాదు. నీ కీర్తి దశదిశల వ్యాపింపవలయునని కోరకుము. ఆబాల గోపాలము నిన్నే ప్రేమింపవలెనని యనుకొనకుము. స్వతంత్రతను గోల్పోవక లాభ నష్టములను సరకు సేయక కారణ బద్ధుడవై పుట్టినదాదిగ మెలగుము. ఇరుగు పొరుగు వారి దుస్థితిని గాంచుము. ఆలు బిడ్డల మలమల లాడ జేయకుము. ప్రశాంతుడవై యుండుము. నీ మోము దమ్మి చిఱునగవు దొలకాడనిమ్ము. కొంతపడకుము. ఉన్నది చాలును. గాసి వలదు. ఇతరులకు వివిధకృత్యము లుండవచ్చును. నీవు వాని నొనర్చ బని లేదు. వేకువనె లేచి బడలిక యంతయు సమసెనని సంతోషపడుము. నవీనోత్సాహము నీకు బుట్టినది. చెవి యొగ్గి ప్రణయ నినదమును వినుము. యీశ్వర ప్రేమను గొనియాడుచుండుము. యీశ్వరునకు ధన్యవాదములు చెల్లించుము. పరీక్షలలో దేర జాలనని బెంగ చెందకుము.

గీ. నవ్వుచుండుము లోకము నవ్వుచుండు
ఏడ్చుచుండుము లోకము ఏడ్చుచుండు
దుఃఖమెచ్చోట నుండునో సుఖము నచట
ప్రబలి యున్నను బరికింప వలను పడదు
పాడుచుండుము కొండలు బాడుచుండు
మాఱు మ్రోతలు మోదము నెఱుక పరచు

ఏడ్పులన్నియు గాలిలో నీడ్వంబడును
మొఱల నాలింప నెయ్యది దొరకఁగలదు ?
నవ్వుచుండిన చెంతను నరులు వచ్చి
నవ్వుచుందురు యేడ్చిన నరుని చుందుు
ముదము వలయును వారికె మొఱసఁ దనము
వలవ దింతేని దానిలో ఫలము గలదె ?
విందు గుడిచిన మిత్రులు వేనవేలు
దారసింతురు లేకున్న దరికి రారు
పాట బాడిన సఖులెల్ల బరుగు లిడుచు
నింటిముంగట నిల్తురు నెఱుఁగు మిపుడు
చింతలను బాసి మోదము చెందు తెరువు.

వే. వెం.

# ధర్మసాధన.

———ooo———

లోక వ్యాపారముల నడుమ, గృహ కృత్యముల నడుమ, మనము జీవితము గడపవలసియున్నాము. కొన్ని సమయములందు ఊపిరాడనటుల గిల గిల కొట్టుకొందుము. ఇక జీవనము సాగుట దుర్ఘటముగ దోచును. బ్రతుకు నుపాయ మెద్ది యని తహతహ లాడుదుము. అట్టి తత్తరపాటుతోనె దినములకు దినములు గడపు వా రెందరో యుందురు. వారు బ్రతికియున్నను మృతులైనవారితో సమానమె. ఈభయంకరావస్థను, ఈ మృత్యుసమాన జీవనమును తప్పించుకొని సుఖముగ జీవించుటను వాంఛింతుము. నీటిలో చేపలు, తిమింగిలములు సుఖముగ జీవించును. నీటిలో కలసియున్న ప్రాణాధార వాయువును విభజించి పీల్చగల శక్తి చేపలకు గలదు. తిమింగిలములకు ఆశక్తి లేదు. ఊపిరాడనప్పుడు తిమింగిలములు సముద్రపు అట్టడుగునుండి యుపరిభాగమునకు వచ్చి కావలసినంత గాలిని పీల్చుకొని లోనికి పోయి అది యున్నంతవరకు హాయిగ విహరించి అయిపోయిన తోడనె తిరిగి గాలి పీల్చుకొనుటకు పైకి వచ్చును. భక్తి ఆత్మీయ జీవనమునకు ఆధారము. ప్రపంచ కార్య నిమగ్నులమయ్యు, అందె యిమిడియున్న భక్తిని గ్రహింపగలిగితి మేని, ధన్యులమె; కొందర యెప్పుడు నుండదు. ఆయున్నత స్థితి రానంతవరకు తిమింగిలముల వలె మనము అప్పుడప్పుడు మన లోకజీవితావరణమును విడిచి పోవలయును. నిర్జన ప్రదేశమున మనస్సును కుదుటపరచుకొని యీశ్వర సాన్నిధ్యము పొంది భక్తిని సేకరించుకొని మరల లోకవృత్తమున ప్రవేశించుట కభ్యసింపవలయును.

* * *

భక్తులు రచించిన యీశ్వర స్తోత్రములు, ఈశ్వర ప్రార్థనలు, అర్థము తెలియకపోయినను, ఊరక వల్లెవేయుటచే భక్తి పారవశ్యత కలుగదు. ఆత్మ ప్రబోధనము లేకున్నను, ఈశ్వరుని వైపునకు హృదయము మరలి యుండకున్నను, బుద్ధికితోచినట్లెల్ల భిన్న భిన్న వర్ణనలతో, వివిధ ప్రార్థనా వాక్యములతో నొక దీర్ఘప్రసంగము గావించుట చేతను భక్తి పారవశ్యత కలుగదు. స్వయముగ ఈశ్వరుని సంబోధించుట, మనకు వలసినది యీశ్వరుని గోరుట, ఆతనితో సంయోగలాభము బడయుట, ధర్మసాధన యొక్క యుద్దేశములనుట నిజము. కాని ఆస్థితి ప్రతి మనుష్యునకు, ప్రతి సమయమునందు నుండదు. భక్తుడు సహితము కొన్ని వేళలయందు నీశ్వరానుభవము లేక శుష్క జీవనము గడుపుచున్నానని పరితపించును. యీశ్వరోన్ముఖము గాని యాత్మలతో ఎవరికి స్వయముగ నీశ్వరుని పిలుచుటకు, సొంతమాటలతో ప్రార్థించుటకు సాధ్యము? మన యంతట మనము ప్రార్థనలు జేయజాలని సమయముల వానిని అల్లుటకు పూని మన యాత్మల మనమె చంపుకొందుమని యెరుగవలయును. కాని యా వేళలందు జేయదగినది యేమి? భావగర్భితములును, భక్తి పూరితములు నగు మహాభక్తుల కీర్తనలు, ప్రవచనములు, వారి సాంగత్యము మన యాత్మలను మేల్కొల్పగలవు. మృతినొందిన మహాత్ముల జీవనములను సంస్మరించుటయు మన యాత్మలు జాగరిల్లుటకు తోడ్పడును. సూదంటు రాయితో చేరిన యినుపముక్కలు దాని యందలి యాకర్షణ శక్తిని బొందును. వట్టి రాళ్ల మధ్యమున ఎంత కాలము పడియున్నను వాని కాశక్తి కలుగుట వట్టిదె. అంధప్రాయముగ గాక బుద్ధిపూర్వకముగ ధర్మగ్రంథముల పఠనము, మహత్కీర్తనముల గానము, మహాపురుషుల సహవాసము సలుపగలిగితి మేని ఆత్మోద్దీపనము తప్పక కలుగును.

# పంచములు గుళ్లలోనికి పోవచ్చును.

———:o:o:o:———

టి. కె. మాధవన్నాయరు గారితో తిరునల్వేలిలో సెప్టెంబరు ౨౪ వ తేదిన మాటాడుచు, „ఎజూవాలకు, ఇతరులకు, ప్రజోపయోగమునకై కట్టింపబడిన దేవాలయముల లోనికి ఇతర బ్రాహ్మణేతరులతో బాటు వెళ్లి దేవుని యారాధించు హక్కు గలదు. మత సంబంధమగు కారణముల వలన వీరిని లోపలకు వెళ్లనియ్య కూడ దనుట చాల పాపము, ద్రోహము. ఆత్మనిగ్రహము గలిగి యీసంఘము వారు ప్రవేశింప నెంచి రేని దేవాలయముల లోపల ప్రవేశింప వచ్చును. చట్టము ప్రతి కూలముగ నున్నను, కారా గృహ శిక్ష ననుభవింపవచ్చును. అస్పృశ్యత తగదు గాని వర్ణాంతర, జాత్యంతర, భోజనములు వివాహములు అవశ్యములు కావు. యీ రెండును ఆధ్యాత్మిక, ఆరోగ్య విషయములపై నాధార పడి యుండును. జాతు లుండి తీరవలయును.” అని మహాత్మ గాంధి గారు చెప్పిరి. అగ్రవర్ణముల వా రిప్పుడు తమ నిరంకుశత్వమును విడిచెదరా ?

———

పి. నారాయణమూర్తి గారు, వేమవరపు రామదాసు గారు, యస్. శ్రీనివాసయ్యంగారు, అల్లాడి కృష్ణస్వామయ్యగారు, మరి ౪౦, ౫౦ మంది హైకోర్టు వకీళ్లు రాట్నముతో వడికి చేమగ్గములచే తయారు జేసిన గుడ్డలనే ధరించి కోర్టులకు బోవలె నని తీర్మానించుకొనిరి.

———

సత్యమేవజయతే

ధర్మసాధని

శనివారము, అక్టోబరు, ౨౨, ౧౯౨౧.

# సనాతన హిందూ ధర్మము.

—————o:o:o—————

## మహాత్మా గాంధిగారి మత విశ్వాసములు.

అక్టోబరు ౬ వ తేది 'యంగు ఇండియా' పత్రికయందు మహాత్మా గాంధిగారు ప్రకటించిన మత విశ్వాసముల పురస్కరించుకొని రాబోవు సంచికలో కొంత వ్రాయదలచితిమి. ఈ తూరి వానిని సంక్షిప్తముగా నీ క్రింద పొందుపరచుచున్నాము.

నాది సనాతన హిందూ ధర్మము. 'సనాతన' యను పదమును దాని నిజార్థమున వాడుచున్నాను. నేను సనాతన హిందువునని పిలుచుకొనుటకు కారణములు:

౧. వేదములు, ఉపనిషత్తులు, పురాణములు, హిందూ శాస్త్రములని చెప్పబడు సకల గ్రంథములు నాకు విశ్వాస పాత్రములు. అవతారములు, పునర్జన్మ గలవని నమ్మెదను.

౨. ప్రచలిత మూఢభావమున గాక వైదికార్థమున వర్ణాశ్రమ ధర్మము నంగీకరించెదను.

౩. సామాన్య జనులు తలంచుదాని కంటె నెక్కుడు విపులార్థమున గో సంరక్షణము నెడ నా కామోదము గలదు.

౪. విగ్రహారాధన యందు నమ్మకము లేని వాడను గాను.

వేదములు మున్నగు హిందూ ధర్మగ్రంథములు మాత్రమె ఈశ్వర దత్తములని నేను తలంపను. వాని వలె బైబిలు, ఖొరాను, జెండవెస్తా మొదలగు అన్యమత గ్రంథములును ఈశ్వర ప్రేరితములె. మరియు హిందూ శాస్త్రములలోని ప్రతి వచనము, ప్రతి శ్లోకము ఈశ్వర ప్రేరణ వలననె లభించెనని అంగీకరింపను. ఎట్టి గురువులచే శాస్త్రముల కొసంగబడు వ్యాఖ్యానము నైనను నాబుద్ధికి లేక మనస్సాక్షికి విరుద్ధముగ నుండినచో స్వీకరింపను. అహింసా వ్రతమున, సత్య వ్రతమున, బ్రహ్మచర్య వ్రతమున, పరిపక్వము గాంచనట్టియు, ధన సంపాదన సంరక్షణాలు త్యజింపనట్టియు వారలకు శాస్త్ర లవగాహములు గావనుట నిజము. గురువు లుండుట యావశ్యకమె గాని, ఈ కాలమున పూర్ణజ్ఞానము, పూర్ణ పవిత్రత, రెంటిని గల పుణ్యపురుషులు నకృత్తుగా నున్నారు. కావున, పలువురు గురువులు కలిగి యుండకుండుట తటస్థించుచున్నది. కాని తన మతమునందలి సత్యము తెలిసికొన లేక పోవుదునని యెవరును నిరాశజెంద జనదు. హిందూ మతము యొక్కయు, ప్రతి మహా మతము యొక్కయు మూల సత్యములు శాశ్వతములు, సులభముగ గ్రహింప దగినవి.

వర్ణాశ్రమ విధానము మానవ ప్రకృతియందె యిమిడియున్నది. హిందూమతము దానికి ఒక శాస్త్ర రూపము నిచ్చినది. అది జన్మమునకు జెందినది గాదు. ఒకడు ఇచ్ఛానుసారము తన వర్ణమును మార్చుకొనుట యసాధ్యము. వర్ణము నంగీకరింపకుండుటయన వంశపారంపర్యముగా ప్రత్యేక స్వభావములు లభించి పెంపొందునను సిద్ధాంతము నంగీకరింపకుండుటయె. ఈ సిద్ధాంతము ననుసరించి హిందూ సంఘములోని యసంఖ్యాకములగు కులములన్నియు నేర్పడెనని చెప్పలను పడదు. నాలుగు విభాగములె చాలియున్నవి. భోజన ప్రతి భోజనములచే గాని వివాహ బాంధవ్యములచే గాని, ఒకనికి పుట్టుకవలన గలిగిన యాధిక్యతకు భంగము రానేరదు. నాలుగు వర్ణములు వృత్తి విభజనమును మాత్రము తెలుపునవి. సాంఘిక సంబంధములకు అడ్డురావు. ఆ విభజనము ధర్మముల నిరూపించును గాని అధికారము లొసంగదు. ఒకడు అధికుడని, ఒకడు అధముడని తలంచుట హిందూ మతమునకు విరుద్ధము. బ్రాహ్మణుడు బుద్ధి బలముతో, క్షత్రియుడు బాహు బలముతో, వైశ్యుడు వాణిజ్య నిపుణతతో, శూద్రుడు శరీరపరిశ్రమతో—అందరు తమ తమ శక్తులతో ఈశ్వర సృష్టికి సేవ సల్పవలసి యున్నారు. ఒక శక్తి కలిగియున్న వాడు మరియొక శక్తిని సంపాదింప గూడదని గాదు. ఒక్కొక్కనిలో ఒక్కొక్క శక్తి యధికముగా పనిచేయును. వాడు ఆ శక్తి ద్వారముననె ముఖ్యముగ సేవజేయ నర్హుడు. ఏ శక్తిని జూచుకొని యెవరును గర్వింప బనిలేదు.

ఆత్మ నిగ్రహమునకు, మానవశక్తుల క్రమోపయోగమునకు, వర్ణాశ్రమ ధర్మము ఉద్దేశింపబడినది. భోజన ప్రతి భోజనములచే గాని అంతర్జాతీయ వివాహములచే గాని వర్ణాశ్రమ ధర్మమునకు నష్టమేమియు లేదు. కాని భిన్న వర్ణస్థులు కలసి భుజించుటను, వివాహములు చేసికొనుటను హిందూ మతము తీవ్రముగ నిరుత్సాహపరచును. ఆత్మ నిగ్రహములో హిందూమత మున్నతస్థాన మధిరోహించినది. శరీర సంయమముచే ఆత్మ విమోచనమునకై పాటుపడు మతము హిందూ మతము. వివాహ విషయమున, భోజన విషయమున, నియమములుండుట ఆత్మాభివృద్ధికి ప్రధానసాధనము. కాని యీనియమముల మీద వర్ణ వివక్షత నాధారపడియుండలేదు. తన కర్తవ్యమును విడువక శూద్రునితో భోజనము చేసినను బ్రాహ్మణుడు బ్రాహ్మణుడే.

వర్ణాశ్రమ ధర్మము కంటె గోరక్షణము హిందూమతమున నెక్కువ ముఖ్య విషయము. మానవ పరిణామమున గో రక్షణ మొక యద్భుతమగు మార్పును సూచించును. మనుష్యుడు ఆ ధర్మమనుసరించి తన జాతిని దాటి అన్యప్రాణికోటి నెడ ప్రేమ జూపును. గోపదము గోజాతినే గాక, మానవులకంటె హీనమగు సమస్త జంతుజాలమును తెలుపు పదముగ నేను గ్రైకొనుచున్నాను. గోపద ముపయోగింప బడుటకు కారణము నాకు స్ఫురించుచున్నది. హిందూ దేశమున మనుష్యులతో కలసి యుండుటకు శ్రేష్ఠతమమగు జంతువు గోవు. అది పాలనిచ్చును. వ్యవసాయమునకు తోడ్పడును. అనేకులకు తల్లి వంటిది. గోరక్షణకు అర్థము సమస్త జంతుజాల రక్షణయని గ్రహింపవగును. గోరక్షణ హిందూమతము ప్రపంచమున కొసంగగల యొక మహాధర్మము.

నాకు విగ్రహారాధనయం దపనమ్మకము లేదని చెప్పితిని. విగ్రహము నాయందు పూజ్యభావము జనింపజేయుట లేదు. విగ్రహపూజ మానవులకు సహజమని తలంచెదను. చిహ్నములకై మానవహృదయము తపించును. ఇతర స్థలములందు కంటె ఉపాసనా మందిరమున నొకని కేల నెక్కుడు శాంతచిత్తము కలుగుచున్నది? విగ్రహములు ఉపాసనకు సాధనములు. విగ్రహమును దేవునిగ ఏ హిందువు పరిగణింపడు. విగ్రహపూజ పాపమని నేను తలంపను.

పైన వివరించిన దానిని బట్టి హిందూమతము అన్యమతా తాపమొసంగునది కాదనుట సరిగాదని తేల గలదు. ప్రపంచ ప్రవక్తలందరిని పూజించుటకు హిందూ మతమున అవకాశము గలదు. అది ప్రచార మతము సామాన్యార్థమున కానిమాట వాస్తవము. అది చాల తెగలను అంతర్భుక్తము గావించుకొనినది. ఈ కలుపుకొనుట కానరాకుండ క్రమముగా జరుగుచున్నది. ఎవని విశ్వాసానుసారము వారు ఈశ్వరు నుపాసింప వలెనని గోరుచు హిందూమతము అన్ని మతములతో సఖ్యము నెరపును. పై కారణముల వలన నే నేల సనాతన హిందువని పిలుచుకొను చున్నానో తేటపడి యుండును. అనేక దోషములు హిందూమతమున గలవని నాకు తెలియును. కాని నాభార్య యెన్నిలోపములు గలిగియున్నను అన్య స్త్రీలకు లేని వశీకరణశక్తి నెటుల నాపై గలిగియున్నదో అటులనే హిందూమతము నన్ను తనకు బద్ధునిగ జేసికొనెను.

---

## సరళత యన నిట్టిది.

బాలవ్యాకరణమును నీతిచంద్రికను రచించిన ప్రఖ్యాత పండితులు శ్రీ పరవస్తు చిన్నయ్యసూరిగారి జీవిత చరిత్రము గత ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికయందు ప్రచురింప బడినది. చిన్నయ సూరిగారి పాండిత్య విశేషమును వారి కంటె తక్కువ యుద్యోగములో నుండిన హయగ్రీవ శాస్త్రిగారి సరళ వర్తనమును ప్రకటించు నందలి భాగమును ఈ దిగువ పొందు పరచుచున్నాము. ఇప్పుడు చెన్నపురిలో ప్రెసిడెన్సి కాలేజియని పిలువబడునది అప్పుడు హైస్కూలుగా నుండెను.

"ప్రకృతమున నున్న న్యాయస్థానమున న్యాయాధిపతులలో నొకరగు శ్రీ గా. న్యాయమూర్తి కుమారస్వామి శాస్త్రిగారి పితామహులగు రంగనాథ శాస్త్రులవారు ఆకాలమున "స్మాలుకాజు కోర్టు" లో న్యాయాధిపతులుగ నుండిరి. వీరికి సంస్కృత భాషయందే కాక శాస్త్రములయందును, గొప్ప భాషలందును బాండిత్య ముండెను. వీరు నివసించు గృహమున కనతిదూరముననే హయగ్రీవ శాస్త్రిగారి నివాస మగుటం జేసి వీరికి రంగనాథ శాస్త్రిగారితో నధిక పరిచయమును రంగనాథ శాస్త్రిగారికి హయగ్రీవ శాస్త్రిగారి యం దధికాభిమానమును సంభవించినవి. ఇట్టి యనుబంధము వలన శ్రీ రంగనాథ శాస్త్రిగారు హయగ్రీవ శాస్త్రిగారి నెట్టులయిన బ్రధానాధ్యాపకులుగా నియమింప వలయునని తలంపు గొనియుండిరి. ఒకనాడు హయగ్రీవ శాస్త్రిగారితో "ప్రభుత్వమునకు నివేదించి మీకు బ్రధానోపాధ్యాయత నిప్పింతుమని చెప్పగా హయగ్రీవ శాస్త్రిగారు

---

దానికి సమ్మతింపక తమకంటె నధిక పాండితి గల సూరిగారే యీపదవికి దగిన వారని తెలిపి సూరిగారి పాండిత్యము ప్రకటించుటకై రంగనాథ శాస్త్రిగారి కోరికపై నొక యాదివారమునాడు సూరిగారిని వెంట నిడుకొని రంగనాథ శాస్త్రిగారి యింటికి కేగిరి. మధ్యాహ్నము మూడు గంటల కాలమునకు సూరిగారు రంగనాథ శాస్త్రిగారి కోరికపై నలంకార శాస్త్రవిషయమున నొక యుపన్యాసము గావింప నారంభించిరి. ఆ యుపన్యాస ధోరణీ నిమగ్నులగు రంగనాథ శాస్త్రిగారి కెంతవేళ యైనదో తెలియదయ్యె. పనికత్తె దీపము వెలిగించినది. ఉపన్యాసము జరుగుచునే యున్నది. వినువారికి విసుగు పుట్టకుండుటయే కాదు తనివి తీరలేదు. భోజన సమయమున సూపకారుని నివేదనముం బట్టి కాలాతిక్రమణమును రంగనాథ శాస్త్రిగారు గుర్తించిరి. సభామధ్యమున శ్రీ సూరిగారి యెడల దమకిదివర కున్న యభిప్రాయమును వదలుకొంటి మని సెలవిచ్చి నాటి సభను శ్రీ రంగనాథ శాస్త్రులవారు ముగించిరట. మఱియు నప్పటప్పట హయగ్రీవ శాస్త్రిగారితో పాటు సూరిగారిని గూడ దమ యింటికి వచ్చుచుండు డని కోరిరట."

---

## బ్రాహ్మ సమాజము.

—o:o:o—

ఏప్రిలు మొదలుకొని ఆరు మాసముల వరకు పాలపర్తి నరసింహము గారిచే చేయబడిన కార్యము యొక్క వివరము:—

ఉపాసనలు–ప్రసంగములు:— యథా ప్రకారము గుంటూరు ప్రార్థన సమాజమునందును భ్రాతృసమితి యందును ఉపాసనలు కావించిరి. సంవత్సరాది పండుగ సందర్భమునను, రామమోహనుని వార్షికోత్సవ సందర్భమునను, శ్రీ కో॥ రామారావుగారి వివాహ సందర్భమునను ప్రత్యేకోపాసనలను ప్రసంగములను సలిపిరి.

బెజవాడ, చీరాల, ఈపూరి పాలెం, బాపట్ల పురములందు సామాజికోపాసనలను ప్రసంగములను కావించిరి.

ఉపన్యాసములు:— శ్రీ వీరేశలింగం గారి జయంత్యుత్సవము నాడును రామమోహనరాయలవారి సాంవత్సరీ కోత్సవమునాడును ఉపన్యసించిరి. బెజవాడ స్త్రీ సమాజ పక్షమున భక్తిని గూర్చి ప్రసంగించిరి. బాపట్లలో హిందూ సంఘాభివృద్ధిని గూర్చి ఉపన్యసించిరి.

రచనలు:— శ్రీ వీరేశలింగ జయంతి, మృతులైన వారితో సంభాషణ, విశ్వాస విజృంభణము, మాతృభాష—మతగ్రంథములు, మాతృభాష—ధర్మసాధన, ఆత్మస్వాతంత్ర్యము, వాక్యబలము— మార్టిను లూథరు, దేవుడు— దేవతలు, సత్యాన్వేషణము మన ధర్మము, సహజ భక్తి అను విషయముల గూర్చి ధర్మసాధనకి వ్యాసములు వ్రాసిరి. ప్రార్థనలను ధర్మబోధకములగు వాక్యములను వ్రాసిరి.

విజ్ఞానవల్లికి శ్రీ వీరేశలింగము గారిని గూర్చి యు పాప విమోచనమును గూర్చియు వ్యాసముల రచించిరి.

డాక్టరు ఛానింగు మహాత్మునిచే రచింపబడిన ఆత్మీయ స్వాతంత్ర్య మను మహోపన్యాసమును చాల వరకు ఆంధ్రీకరించిరి. ఈ ఉపన్యాసమునందు మహాత్ముడు మత రాజకీయ స్వాతంత్ర్యములు ఆత్మస్వాతంత్రిత కెట్లు ఆవశ్యకములో ఋజువు పఱచి యున్నాడు.

ఇతరములు:— సేవాసమితి పక్షమున నడప బడు స్త్రీల భాండాగారము యొక్క అభివృద్ధికి తోడ్పడిరి.

విజ్ఞానవల్లరిలో శ్రీ వీరేశలింగము గారు, పాప విమోచనము, శ్రీ రామమోహనుడు, అను విషయముల ప్రచురింప జేసిరి.

శ్రీ రాయసం వెంకట శివుడుగారికి మందిర నిర్మాణమునందు సాయము చేసిరి.

---

## బరంపురము.

ఈ నెల ది ౧౦ తేదిని బరంపురం బ్రహ్మోపాసన మందిరములో శ్రీ యళ్ళాయి సన్నయ్యగారు ఈశ్వరోపాసన సలిపి రొక్కం బాలకృష్ణరావుగారి తృతీయ పుత్రునికి 'శివనాథశాస్త్రి' యని నామకరణ చేసిరి. ఈ సందర్భమున బాలకృష్ణరావుగారు శివనాథ స్మృతినిధికి ఒక రూపాయి, కటకం ఉత్కల ఆర్ఫనేజికి ఒక రూపాయి, పంఢరీ పురం ఆర్ఫనేజికి ఒక రూపాయి, విరాళము లొసంగిరి. బాలుని జగత్పాలకుడు ఆశీర్వదించును గాక!

---




## ఫౌంటెన్ కలము.

| | | |
|---|---|---|
| 1. "బ్లాకు బర్డు" ఫౌంటెన్ పేనా, 12 ct బంగారు పాళీతో | | రు. 3- 0-0 |
| 2. "హార్డు వేరు" ,, | 14 ct ,, | 2- 8-0 |
| 3. "స్వాన్" ,, | 14 ct బంగారు పాళీతో కలది. ప్రశస్తమైనది | 5- 0-0 |
| 4. "వాటరుమేన్ ఐడియల్" ఫౌంటెన్ పేనా 14 క్యారట్ల బంగారు పాళీ కలది. మిక్కిలి నాణ్యము | | 7- 0-0 |
| 5. "ప్రిమియరు" ,, | 14 ct బంగారు పాళీతో ,, | 5- 0-0 |

కలములు వి. పి. గా పంపబడును. వ్రాయునపుడు, సన్నపుపాళీ కావలెనో, ముదుగుపాళీ కావలెనో వ్రాయవలయును. మేము మంచి కలములను చక్కగా పరిశోధించి చూచిన పిమ్మటనే పార్సిలు ద్వారా పంపుదుము. కావున, దూరమునందున్నవారు నమ్మకము కలిగి బంగీలద్వారా వారికి కావలసిన కలములు తెప్పించుకొనవచ్చును. వలయువారు ఈక్రింది అడ్రెసునకు వ్రాసికోవలెను.

యమ్. హెచ్. రావు అండు సన్సు, తపాలాపేట్ట నెం. 29, కాకినాడ.

# కేసరి—రత్నత్రయము.

## లోధ్ర.

గర్భాశయ రోగనివారిణి.

స్త్రీలకు గలుగు ఋతుశూల, బహిష్టు కాకుండుట, అకాల బహిష్టు, మైల జాస్తిగాను, తక్కువగానుపోవుట, కుసుమరోగము, సంతానహీనత, రక్తహీనత, మలబద్ధకము, సూతికావాతము, కీళ్ళనొప్పులు, అరికాళ్ళు, అరచేతులు మంట మొదలగు స్త్రీ మర్మవ్యాధులను కుదుర్చును. 24. ఔ రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

## అమృత.

రక్తశుద్ధి దాయకము.

ఇది రక్తహీనత, మలబద్ధకము, అజీర్ణము, కీళ్ళునొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, నిస్సత్తువ, కడుపుబ్బు మంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతి సుఖమునకు తేజస్సును యిచ్చును. 24. అవున్సులు రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

## అర్క.

సర్వజ్వర నివారిణి.

వాత, పిత్త, కఫ, విషమ, సన్నిపాతకొండ, మన్య సమస్త జ్వరములు జ్వరబిళ్ళ విషపడిశ మహోత్కృష్టముగ కుదుర్చును. 6 అ రు 2-8-0; 3 అ రు 1-8-0; 1 అ 0-8-0.

కేసరికుటీరం, ఆయుర్వేద ఔషధశాల.
ఎగ్మోర్, మదరాసు.

# P. SUBBAROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

# పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్ళ సన్నిధి, తంజావూరు.


ఓమం వాటర్.

42. ఇవి సాధారణమైన బజారులయందు పెద్ద సీసాలోను అమ్మే ఓమం వాటర్ కాదు మాయందు తయారు చేయబడిన పై జెప్పిన ఓమం వాటర్ ½ అవున్సు సీసాలయందు అమ్మబడుచున్నది దీనిబొట్లు లెక్కతో వుపయోగించిన చాలును. యీచిన్న సీసాలోనిది 24 అవున్సు పరిశుద్ధమైన వుదకమును చేర్చుకొన్నయెడల బజారులయందు అమ్ము ఓమం వాటర్ కన్న మిక్కిలి మేలైన ఓమం వాటర్ ను నిచ్చును. కడుపు వుబ్బసం, కడుపునొప్పి, అగ్నిమాంద్యము, అజీర్ణభేది వీటికి యిచ్చిన యెడల సౌఖ్యమగును జీర్ణశక్తి యగును. మరిన్ని, కలరాయను వాంతిభేది రోగమునకు దీని కిచ్చి తగుమైన గుణమును గాన్పించడమయినది. దీని ఖరీదు సీసా 1 కి అణాలు 8.

వి. పి. కర్చు 1 మొదలు 6 సీసాల వరకు అణాలు 8 ప్రత్యేకము.

---

బొల్లికి మందు.

పైన పూయవలసినది. ఒక వారము వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు. మెల్లగా పని చేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి. చార్జి 8 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధముల యొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

# అమృతాంజనము.

## సుందరమైన 1921 ఉపయోగమైన

## క్రొత్తక్యాలండరు

విక్రియమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0=4=0 వి. పి. ఖర్చులు సహా 0=6=0

వెంటనె వ్రాసుకొనవలయును.

| తామర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
|---|---|---|
| డబ్బి 1 కి, 0=6=0 | డబ్బి 1 కి, 0=2=0 | సీసా 1 కి, 0=12=0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు, జెణుకులు, బెణుకులు, బిళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బీతో సహా వెల రూ. 0-10-0. డజను 1 కి రూ. 6-0-0 పోస్టు ఖర్చులు వేఱు.

---

## అమృతాంజనము డిపో,

౧౦౯, ఫేరిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మదాసు.

## వైద్యరత్న పండిత డి. గోపాలాచార్యులుగారి

## జీవామృతము.

రక్తమును వృద్ధిజేయును. మేహవాత నొప్పులను బోగొట్టును. అన్నివిధములగు బలహీనతలను అణచును. పాండురోగులకు మంచిది. గుండెదడను నివారణజేయును. గర్భకాకరములను దరుచును. బాలురకు గర్భిణీలకు నుత్తమము. చనుబాలను వృద్ధిపరచును. మూర్ఛలకు మంచిది. మెదడుకు బలమును గలుగజేయును. నరములకు శక్తిని హెచ్చించును. విద్యార్థులకు ప్రాణమిత్రము. ప్రాణ శక్తిని హెచ్చించును. క్షయరోగులకు మిగుల మంచిది. కాసరోగులకు అమృతము. గుండికాయకు మిక్కిలి బలము నిచ్చును. ఊపిరి తిత్తులకు అధికబలము జేయును. ఉబ్బసరోగులకు మిగుల హితము.

వెల బుడ్డి 1-కి రూ 3—4—0. ప్యాకింగు పోస్టేజి ప్రత్యేకము. క్యాటలాగు ఉచితము.

తంతి విలాసము. పండిత్ మదరాసు. ఆయుర్వేదాశ్రమం, 41, ఆచార్యప్ప వీధి, జి. టి. మదరాసు.


**Reg. No. M. 1094.**
The Dharma Sadhani, Cocanada.

Printed & Published at the Dharma Sadhani Press Cocanada, by the Editor, K. Hanumanta Rao.

To M. R. Ry. V. P. Rs. As.